సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఈవీఎంల పనితీరుపై అవగాహన అవసరం

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 1 : పోలింగ్ రోజు నిర్వహించే విధులు, ఈవీఎంల పనితీరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణ రెడ్డి, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్, జిల్లా లెవల్ మాస్టర్ ట్రైనర్స్‌కు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలింగ్ విధుల నిర్వహణపై ట్రైనర్స్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారుల హ్యాండ్ బుక్‌లో ఉన్న ప్రతి అంశంపై అవగాహన ఉండాలని, వాటిలో సూచించినట్లు పోలింగ్ సామగ్రిని సేకరించుకోవాలని తెలిపారు. నిర్దేశిత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటింగ్ గోప్యత నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చూపులేని దివ్యాంగ ఓటర్లు సహాయకుడితో ఓటు వేసేందుకు ఫామ్ 14-ఏ నిబంధనలను పాటించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారు తప్పని సరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, మీరందరూ వివరాలు ఇవ్వాలన్నారు.

పీవో, ఏపీవోలకు శిక్షణ

ఈ నెల 2, 3 తేదీల్లో వికారాబాద్ నియోజకవర్గంలో బాయ్స్ జూనియర్ కళాశాల, పరిగి నియోజకవర్గంలో జిల్లా పరిషత్ బాయ్స్ స్కూల్‌లో పీవో, ఏపీవోలకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో తాండూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, కొడంగల్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధీర్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస రావు, ఎన్నికల విభాగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: నీటిని సరఫరా చేసే యంత్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఏప్రిల్ 1 : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించి తాగునీటి సరఫరా తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా చేతిపంపులను మరమ్మతులు చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బీటీఎస్ కాలనీలో సంప్ హౌజ్‌ను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జాకీర్ ఆహ్మద్ ఉన్నారు.

ధారూరు : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రతలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబందిత అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని కేరెళ్లి, ఎబ్బనూరు గ్రామాలను సందర్శించి బోర్‌వెల్స్, చేతి పంపుల పనితీరుపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సరపరాపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీపీవో జయసుధ, ధారూరు ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షఫీఉల్లా, ఏపీవో సురేశ్‌కుమార్, కేరెళ్లి పంచాయతీ కార్యదర్శి రేవంత్, ఎబ్బనూరు పంచాయతీ కార్యదర్శి రేఖ తదితరులు ఉన్నారు.

మహిళా అభ్యర్థులకు శిక్షణ

మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 1 : తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ (టీఎస్‌పీఏ) లో శిక్షణ తీసుకుంటున్న 280 మంది మహిళా అభ్యర్థులకు సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. శిక్షణా సమయంలో ఎ లాంటి నిర్లక్ష్యం చేయకుండా క్రమశిక్షణతో ఉండాలని ఈ సమయం ఎంతో విలువైందన్నారు. అనంతరం అభ్యర్థులకు ఏ వో జోతిర్మనీ, ఏఆర్ డీఎస్పీ వీరేశం, టీఎస్‌పీఏ నుండి వచ్చిన అధికారులు, ఆర్ఐ, డీపీవో సిబ్బంది ఫంక్షనింగ్ అఫ్ డీపీవో, మెయింటనెన్స్ రికార్డ్స్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

రైలులో 14 కేజీల గంజాయి పట్టివేత

వికారాబాద్, ఏప్రిల్ 1 : భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం 14 కిలోల గంజాయిని పట్టుకున్నామని వికారాబాద్ రైల్వే సీఐ జూపల్లి వెంకటరత్నం తెలిపారు. సోమవారం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. ఆదివారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో వికారాబాద్ రైల్వే ఎస్సై శంకరయ్య, ఆర్పీఎఫ్ స్పెషల్ ఫోర్స్ సికింద్రాబాద్ నుంచి తనిఖీలు చేపట్టారు. ఒరిస్సా నుంచి 14 కిలోల ఎండు గంజాయిని రెండు బ్యాగుల్లో తరలిస్తున్న అనిల్, మనోజ్‌లను పట్టుకున్నారు. విచారణ చేసిన పోలీసులకు ఈ గంజాయిని బరకపూర్ నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి ముంబాయిలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ గంజాయి విలువ రూ.2లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులది మధ్యప్రదేశ్ అని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాధ్యతగా ఎన్నికల నిర్వహణ

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

- ప్రిసైడింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక
- పీవో, ఏపీవోలకు శిక్షణ

రంగారెడ్డి, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో బాధ్యతగా నిర్వర్తించాలని, ముఖ్యంగా ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహించే రాజేంద్రనగర్ నియోజకవర్గ సిబ్బందికి రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, శేరిలింగంపల్లి నియోజకవర్గ సిబ్బందికి మాదాపూర్ శ్రీవెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజ్‌లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం నిర్వహించిన శిక్షణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల రోజున విధులను నిర్వర్తించడంపై ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పీవో డైరీ, 17సీ పై పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు. సరైన సమాచారం నమోదు చేయాలి పోలింగ్ రోజున అవసరమయ్యే కవర్‌లో సరైన సమాచారాన్ని నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి వీవీ ప్యాట్లలో ఉండే స్లిప్‌లను ప్రత్యేక కవర్‌లో ఉంచాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కోసం ఫామ్-12ను తప్పనిసరిగా నింపి సమర్పించాలని సూచించారు. పీవోలు, ఏపీవోలకు మూడు సార్లు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే సెక్టోరియల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. బూత్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌పై సీల్ వేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, రాజేంద్ర నగర్ ఏఆర్ఓ వెంకట రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అత్యవసర సర్వీసులకు చెందిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో అత్యవసర శాఖల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ద్వారా మీడియా పాసులు కలిగిన జర్నలిస్టులకు కూడా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలక్షన్ కమిషన్ వెసులుబాటు కల్పించిందన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుపడని వారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని నోడల్ అధికారులకు సూచించారు. ఏప్రిల్ 20వ తేదీ లోపు సమర్పించే ఫారం -12(డీ)లను మాత్రమే పరిగణలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఫారం -12 (డీ) దరఖాస్తులను నోడల్ అధికారి నుంచి లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల నుంచి పొందవచ్చని సూచించారు. ఎలక్షన్ కమిషన్ పోర్టల్ నుంచి కూడా డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ఆర్వో కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం నిర్ణీత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ మే 13న జరిగే పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పించబడదన్నారు. ఓటరు జాబితాలో వారి పేరును పోస్టల్ బ్యాలెట్ కింద మార్కింగ్ చేయబడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, నోడల్ అధికారి కృష్ణా రెడ్డి, చేవెళ్ల ఏఆర్‌వో సాయిరాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీఇందు కళాశాలలో పీవోలు, ఏపీవోలు, ఇతర ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు భేష్

- పక్కా ప్రణాళికతో ఉపాధి పనులు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి
- సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్

వికారాబాద్, ఏప్రిల్ 1 : ఈ ఏడాది జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద అన్ని ప్రమాణాలను పాటించి రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని సాధించడం జిల్లాకు గర్వకారణమని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అభినందించారు. సోమవారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో కూలీల సంఖ్యను పెంచుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని సూచించారు. గ్రామ పంచాయతీ పనుల్లో లేబర్ సమీకరణ చేస్తూ పద్ధతి ప్రకారం పనులు చేపడితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శి, మండల ప్రత్యేక అధికారులదేనని, వేసవిని దృష్టి లో ఉంచుకొని గ్రామాల్లో ప్రజలు, జంతువులకు తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. లేబర్ మొబిలైజేషన్ తక్కువ ఉన్న గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులు మానిటరింగ్ చేసేందుకు ఒక వ్యక్తికి బాధ్యతలు అప్పగించి పనులు చేయించాలని సూచించా రు. కార్మికులు తక్కువ ఉన్న గ్రామాలపై దృష్టి పెట్టాలన్నారు. అక్కడ గ్రూపు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అంచనా ప్రకారం ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి గ్రామానికి ఉపయోగపడే పనులను వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చూడాలని ఆయన పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవోలు, ఏపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



నాగిరెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అధికారులు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 1 : దళారులను ఆశ్రయించకుండా రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగ్యానాయక్ మాట్లాడుతూ.. యాసంగి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 122 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సోమవారం జిల్లాలో ఎనిమిది కేంద్రాలను ప్రారంభించామని, మిగతా మండలాల్లో ఈ నెల 4న పూర్తిస్థాయిలో కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో 1,93,350 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనా నేపథ్యంలో సేకరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గన్నీ బ్యాగులను ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఇవ్వరాదని, రైతులే ధాన్యాన్ని ఆరబెట్టి, చెత్తా చెదారం లేకుండా 17 శాతం తేమ వచ్చాక కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని సూచించారు. ఏ గ్రేడు ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, బీ గ్రేడు ధాన్యం క్వింటాల్‌కు రూ.2,183 ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందని చెప్పారు. రైతులు తమ వెంట భూమి పాస్ పుస్తకం జిరాక్సు, బ్యాంకు ఖాతా జిరాక్సు, ఆధార్ కార్డు జిరాక్సు, వరి పంట సాగు చేసినట్లు ఏఈవో ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని సూచించారు. రైతులు తెచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్‌రావు, మేనేజర్ సుగుణాబాయి, డీపీఎం రాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఏవో తిప్పేస్వామి, ఏఈవో రేణుక, వీవోఏ రాంచంద్రయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు సంగీత, రైతులు పాల్గొన్నారు.

తీర్థయాత్రకు వెళ్లొచ్చేసరికి ఇల్లుగుల్ల

- తాళం వేసిన ఇంటిని లూటీ చేసిన దుండగులు
- 5 తులాల బంగారం, 120తులాల వెండి, రూ.3.50 లక్షలు అపహరణ
- సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ అనుకుని నెట్ బాక్స్‌ను ఎత్తుకెళ్లిన వైనం

మొయినాబాద్, ఏప్రిల్ 1: తీర్థ యాత్రకు వెళ్లొచ్చేసరికి ఇల్లును గుల్ల చేసిన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలం పరిధిలోని బాకారం గ్రామానికి చెందిన రాయన్నోళ్ల ఉపేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 30న కొమరవెల్లి దేవస్థానానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు అదేరోజు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి లూటి చేశారు. కప్‌బోర్డులో ఉన్న రూ.3.50 లక్షల నగదు, 5 తులాల బంగారు, 120 తులాల వెండి ఆభరణాలను అపహరించారు. 31న రాత్రి 8 గంటలకు ఇంటికి తిరిగొచ్చిన కుటుంబ సభ్యులో ఇంటితాళం పగులగొట్టి ఉండడంతో ఆందోళనకు గురైనవారు లోపలివెళ్లి చూడగా.. నగదు, ఆభరణాలు కనిపించలేదు. ఉపేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెక్కీ నిర్వహించిన దుండగులు..

దుండగులు గ్రామంలో రెండు సార్లు రెక్కీ నిర్వహించినట్లు సీసీ పుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. 30న సాయంత్రం 6 గంటలకు, రాత్రి 9 గంటలకు రెండుసార్లు దొంగతనం జరిగిన ఇంటి ఎదుట నుంచి వెళ్లారు. తాళం వేసి ఉన్నట్లు నిర్ధారించుకున్న తరువాత దుండగులు ప్రహరీ గోడ దూకి ఇనుప రాడ్డుతో ఇంటి తాళాలు పగులగొట్టారు. అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి.. నగదు, బంగారు, వెండి ఆభరణాలతో బయటకొచ్చారు. అయితే ఇంటికి సీసీ కెమెరాలు ఉన్నట్లు దుండగులు గమనించారు. దొంగతనం చేసిన తరువాత సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ తీసుకెళ్లొచ్చనే ధీమాతో దుండగులు నిర్భయంగా తమ పని కానిచ్చారు. అయితే దొంగతనం చేసిన తరువాత సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ అనుకుని ఇంటర్‌నెట్ సెటా ప్ బాక్స్‌ను తీసుకెళ్లడంతో అసలు విషయం బయటపడింది. సీసీ పుటేజ్‌ల ఆధారంగా దుండగులను పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ఆస్తికోసం తనయుడి ఘాతుకం

- పక్షవాతంతో మంచానపడిన తండ్రిగొంతుకోసి పరారు
- కోట్‌పల్లి మండలం బీరోలులో ఘటన

వికారాబాద్, ఏప్రిల్ 1: ఆస్తి కోసం కన్నతండ్రి గొంతు కోసిన సంఘటన కోట్‌పల్లి మండలంలో సోమవారం జరిగింది. కోట్‌పల్లి ఎస్సై ప్రవంతి తెలిపిన వివరాలు.. కోట్‌పల్లి మండలం బీరోలు గ్రామానికి చెందిన తాండ్ర రమేశ్ తాగుడుకు బానిసై తన తండ్రి తాండ్ర అంతయ్య పేరున ఉన్న భూమిని పూర్తిగా విక్రయించాడు. తండ్రి అంతయ్య కొంత కాలం నుంచి పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. కాగా, రమేశ్ తాగుడుకు డబ్బులు లేక చివరికి ఇల్లు అమ్మేందుకు పూనుకోగా తండ్రి అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఈ విషయమై కొన్ని నెలలుగా రమేశ్ తన తండ్రితో గొడవ పడుతున్నాడు. ఇక తన తండ్రిని చంపితేగానీ ఇల్లు అమ్మడం వీలుకాదని నిర్ణయించుకున్న రమేశ్ సోమవారం మంచంపైన ఉన్న తన తండ్రి గొంతును కత్తితో కోసి పరారయ్యాడు. అంతయ్య అరుపులు విన్న ఇరుగుపొరుగువారు వచ్చి రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న అంతయ్యను చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అంతయ్య భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

- అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శశాంక, ఇతర అధికారులు

రంగారెడ్డి, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): రానున్న రెండు నెలల పాటు పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని, ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వేసవి తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాల మౌలిక వసతుల కల్పన, వేసవిలో ఉష్ణోగ్రతలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ శశాంక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

ప్రణాళికలు తయారు చేయాలి

ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు స్థాయిలో తాగునీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి పైప్ లైన్ లీకేజీలు అరికట్టాలన్నారు. పనిచేయని బోరు బావులను, చేతి బోర్లను మరమ్మతులతో పునరుద్ధరించాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. క్షేత్రస్థాయిలో మున్సిపల్ ఇంజినీర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు సమన్వయంతో తాగునీటిని సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి లభ్యత, సరఫరాపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యలు ఏర్పడే ప్రాంతాలను గుర్తించాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా

వికారాబాద్ : రానున్న 2 నెలల పాటు పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని , ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి వేసవి తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాల మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వికారాబాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సరఫరా పై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకుని సన్నద్ధంగా ఉన్నామని, ప్రతి రోజు తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రం లేని కారణంగా రైతులు ప్రైవేట్ కు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తున్నారనే మాట రావద్దని సీఎస్ స్పష్టం చేశారు. వీసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ , లింగ్యా నాయక్, డి పి ఓ జయసుధ, డీఈఓ రేణుక దేవి , అధికారులు రాజేశ్వర్, సుగుణ బాయి,డీ.ఎం.హెచ్.ఓ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

తాగునీటి సమస్యను అధిగమించాలి

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

యాచారం, ఏప్రిల్ 1: వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని గున్‌గల్ (ఇందిరానగర్ కాలనీ), యాచారం, గాండ్లగూడ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఆరా తీశారు. తాగునీరు అందిస్తున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా సకాలంలో చే